ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

బుధవారం 7 ఫిబ్రవరి 2024 | 5

రసవత్తరం!

సార్వత్రిక ఎన్నికలు సమీస్తుండడంతో రాజకీయ పార్టీల నుంచి సీట్లు ఆశిస్తున్న వారిలో ఉత్కంఠ పెరుగుతోంది. ముఖ్యంగా టీడీపీ, జనసేన మధ్య సీట్ల సర్దుబాటు వ్యవహారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇరు పార్టీల నేతల్లో ఉత్కంఠతకు కారణమవుతోంది. రాజోలు ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన పోటీ చేస్తుందని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. దీనికి తోడు సోమవారం రాత్రి పక్కనే ఉన్న పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి తెలంగాణ పోలీస్ కమిషనరేట్‌లో అసిస్టెంట్ అక్కౌంట్స్ ఆఫీసర్‌గా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన పి.గన్నవరం మండలం ఉడుమూడిలంకకు చెందిన గిడ్డి సత్యనారాయణను జనసేన ఇన్‌చార్జిగా నియమిస్తూ పవన్‌కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పుడు జిల్లాలో ఉన్న ఏకైక రిజర్వుడు నియోజకవర్గమైన అమలాపురంపై టీడీపీ అభ్యర్థులు దృష్టి సారిస్తుండడంతో రాజకీయం రసవత్తరంగా మారింది.

- టీడీపీ-జనసేన ఆశావహుల మధ్య ఉత్కంఠరేపుతున్న సీట్ల సర్దుబాటు
- మూడు రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజోలు, పి.గన్నవరం జనసేనకేనా?
- అమలాపురం టీడీపీకే.. సీటు కోసం పెరుగుతున్న ఆశావహులు
- ముమ్మిడివరం, రామచంద్రపురంల్లో ఏదో ఒకటి జనసేనకు ఇవ్వాలి
- ఆ పార్టీ నేతల ఒత్తిడితో తలలు పట్టుకుంటున్న టీడీపీ నేతలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇప్పటికే అధికారికంగా ఒకటి, పరోక్షంగా మరో రిజర్వుడు స్థానాన్ని జనసేన అభ్యర్థులను ప్రకటించారు. మరో స్థానం కోసం ఆ పార్టీ పట్టుబడుతోంది. ముఖ్యంగా ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి పోలీసు శాఖకు చెందిన పితాని బాలకృష్ణకు అవకాశం కల్పించాలని పవన్‌కల్యాణ్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఆ నియోజకవర్గంలో విజయావకాశాలపై జనసేన నిర్వహించిన సర్వే ఆధారంగా అక్కడ జనసేనకు ఇవ్వాలా, టీడీపీకి ఇవ్వాలా అనేది నిర్ణయించనున్నట్టు సమాచారం. టీడీపీ ఇన్‌చార్జి, క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు మరోసారి అవకాశం ఇస్తే విజయవకాశాలు మెండుగా ఉంటాయని ఆ పార్టీ వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అటు టీడీపీ, ఇటు జనసేన వేర్వేరుగా నిర్వహించిన వివిధ సర్వేల్లోని ఫలితాల ఆధారంగా అభ్యర్థి ఎంపిక జరగొచ్చని తెలుస్తోంది.

ఇకపోతే జిల్లాలో జనసేనకు మిగిలిన ఏకైక ఆప్షన్ రామచంద్రపురం నియోజకవర్గం. దానిని కేటాయించాలని జనసేన కోరుతున్నప్పటికీ టీడీపీ ఆశావహ అభ్యర్థులు మాత్రం ఆ స్థానాన్ని తమకే కేటాయించాలని ఒత్తిడి తెస్తున్నారు. టీడీపీ రామచంద్రపురం ఇన్‌చార్జిగా శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం వున్నారు. టిక్కెట్లు ఆశిస్తున్న అభ్యర్థులంతా వరుసగా ఒక్కొక్కరు టీడీపీలో చేరేందుకు ఆ నియోజకవర్గాన్నే ఎన్నుకోవడం వెనుక కారణాలు చర్చనీయాంశంగా మారాయి. సుబ్రహ్మణ్యం అంగీకారంతో ఇటీవల పార్టీలో పలువురు కీలక నేతలు చేరారు. వారిలో ముఖ్యంగా కాకినాడ సత్య స్కాన్ సెంటర్ యజమాని డాక్టర్ కాద వెంకటరమణ, అమలాపురం పట్టణానికి చెందిన శెట్టిబలిజ యువనేత వాసంశెట్టి సుభాష్, ఐ.పోలవరం మండలానికి చెందిన టీడీపీ నేత రాయపురెడ్డి రాజా ఆ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక తాజాగా ఏలూరు జిల్లా చింతలపూడిలో జరిగిన సభలో కె.గంగవరం మండలం కోటిపల్లికి చెందిన పప్పులమసేను వెంకన్న అలియాస్ రేవు శ్రీనుకు టీడీపీ అధినేత చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో టీడీపీ టిక్కెట్ ఆశిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అయితే అధిష్ఠానం ఎవరికి పట్టడం కడుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

కొత్తపేట స్థానాన్ని కూడా జనసేనకు ఇవ్వాలంటూ ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీను పట్టుబడుతున్నట్టు తెలిసింది. అయితే రిజర్వుడు నియోజకవర్గాల్లో మిగిలిన అమలాపురం టిక్కెట్ కోసం ఆశావహుల సంఖ్య అధికమవుతోంది. టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అమలాపురం టిక్కెట్ కోసం పోటీపడే అవకాశాలు ఉన్నట్టు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, చిల్లా జగదీశ్వరి, మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు తనయురాలు సత్యశ్రీ, సమనస సర్పంచ్ పరమట శ్యామ్‌లతో పాటు మరికొందరు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. అమలాపురంలో జనసేనకు పట్టు ఉన్న దృష్ట్యా ఆ టిక్కెట్లు తమకే కేటాయించాలంటూ మహాసంకల్ప యాత్ర పేరుతో ప్రజల ముందుకు వెళుతున్న శెట్టిబత్తుల రాజబాబు, పార్లమెంటు లోక్‌సభ జనసేన ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్‌లు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. రాజోలు స్థానాన్నైనా డీఎంఆర్ శేఖర్‌కు కేటాయించాలంటూ జనసేన అధినేతకు ఆయన వర్గీయులు విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిసింది. అయితే అమలాపురం టిక్కెట్ మాత్రం తమకే వస్తుందన్న ధీమాను శెట్టిబత్తుల రాజబాబు వర్గం వ్యక్తం చేస్తోంది. ఇలా ఎవరి ధీమాలతో వాళ్లు రాజకీయ చతురత, ఎత్తుగడలను ప్రదర్శిస్తూ ముందుకు సాగుతున్నారు. అయితే అమలాపురం టిక్కెట్ టీడీపీలో మరో కీలక యువనేతకు వస్తుందన్న ప్రచారం కూడా ఆశావహుల్లో గుబులు రేకెత్తిస్తోంది. ఈ అంశంపై మరికొన్ని రోజుల్లో క్లారిటీ వస్తుందని టీడీపీ వర్గీయుల్లో ఒక వర్గం భావిస్తోంది.



పి.గన్నవరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జిగా నియమితులైన గిడ్డి సత్యనారాయణ



మీ ఓటు... ఎవరికేస్తారు!

సెల్‌ఫోన్లలో సర్వే

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

హలో.. నమస్తే అండి..
నమస్తే అమ్మా.. మీరెవరు..?
నేను సర్వే కోసం మీకు ఫోన్ చేస్తున్నాను
చెప్పండి ఏం కావాలి.
మీరు సుబ్బారావుగారేనా.. అవునండీ
మీది ఏ ఊరు సార్?
మాది అమలాపురం అండి.
మీరేం చేస్తుంటారు?
నేను వ్యవసాయ పనులు చేసుకుంటాను
గత శాసనసభ ఎన్నికల్లో మీరు ఏ పార్టీకి ఓటేశారు?
అప్పుడు వైసీపీకి, ఎమ్మెల్యే విశ్వరూప్‌కు...
ప్రభుత్వ సంక్షేమ పథకాలు మీకందుతున్నాయా?
విద్యుత్ బిల్లు కారణంగా పథకాలు కట్ చేశారు.
వచ్చే ఎన్నికల్లో మీ ఓటెవరికి వేస్తారు?
జనసేన-టీడీపీ కూటమికి ఓటేస్తా
కారణమేమిటి?
ఈసారి వారికి అవకాశం ఇవ్వాలని
మీ కులం ఏమిటి...?
శెట్టిబలిజ అంటూ ముగించారు...
ఇలా గత కొన్ని రోజులుగా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల మనోభావాలను ఫోన్ చేసి మరీ అడిగి తెలుసుకుంటున్నారు. రిప్లై ఇవ్వని వారికి మళ్లీమళ్లీ కాల్ చేసి సర్వే కొనసాగిస్తున్నారు.

ఎన్నికల సమయంలో సెక్టార్ అధికారులకు

మెజిస్టీరియల్ అధికారాలు

- ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచే కోడ్ అమలులోకి
- కలెక్టరేట్‌లో రిటర్నింగ్, సెక్టోరల్ అధికారులకు శిక్షణ



ఈవీఎం పనితీరును వివరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



సెక్టార్ అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సెక్టార్ అధికారులకు ఎన్నికల సమయంలోమెజిస్టీరియల్ అధికారాలు సంక్రమిస్తాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడుసార్లు సందర్శించాలన్నారు. అక్కడి వసతులు, ఓటర్లకు అనుకూలతలపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు కీలక పాత్ర పోషించాలన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో మంగళవారం సెక్టార్ అధికారులు, పోలీసు సెక్టార్ అధికారుల శిక్షణ ఇచ్చారు. రిటర్నింగ్ అధికారులకు సెక్టార్ అధికారులు అనుసంధానమై ఉంటారన్నారు. ఒక రిటర్నింగ్ అధికారి కింద 20 నుంచి 30 సెక్టార్లు ఉంటాయని, ఒక్కో సెక్టార్ అధికారికి 10 నుంచి 12 పోలింగ్ కేంద్రాల పరిధి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియపై సెక్టార్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచే ఎన్నికల కోడ్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటు పాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతీ ఎన్నికను కొత్తగానే చూడాలని, ఏ దశలోను ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకూడదన్నారు. ఈవీఎంల నిర్వహణపై సెక్టార్ అధికారులకు అవగాహన కల్పించారు. సెక్టార్ అధికారులు అనుసంధానకర్తలుగా ముఖ్య భూమిక పోషిస్తారన్నారు. గత ఎన్నికల అనుభవంతో పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించాలన్నారు. దివ్యాంగులు, గర్భిణులు, వయో వృద్ధుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ర్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తరలింపు సమయంలో ప్రభుత్వం కేటాయించిన వాహనాలను మాత్రమే వినియోగించాలన్నారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అందించిన ఈవీఎం, వీవీ ప్యాట్, మేనేజ్‌మెంట్ ప్రొటోకాల్, ప్రిసైడింగ్ హ్యాండ్‌బుక్ వంటి వాటితో ఎన్నికల నియమావళిని తూ.చ. తప్పకుండా పాటించాలన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తగు చర్యలు తీసుకుని అవసరమైతే జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించాలన్నారు. గతంలో పోలింగ్ కేంద్రాల వద్ద చోటుచేసుకున్న ఘటనలను పరిగణలోకి తీసుకుని క్రిటికల్‌గా నిర్ధారించాలన్నారు. వనర్బుల్ పోలింగ్ కేంద్రాలను నిర్ధారించాలన్నారు. ఒకే పోలింగ్ కేంద్రంలో 90శాతం ఓట్లు పోలైతే వాటిలో 75శాతం ఒకే అభ్యర్థికి ఓట్లు పడితే ఆ పోలింగ్ కేంద్రాన్ని వనర్బుల్ పోలింగ్ కేంద్రంగా నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ సమయానికి ఒకటి, రెండు రోజులు ముందుగా గానీ, పోలింగ్ రోజున గానీ ఎఫ్ఐఆర్‌లు నమోదైతే వాటిని కూడా వనర్బుల్ పోలింగ్ కేంద్రాలుగా నిర్ధారించాలన్నారు. జిల్లాలో కొత్తగా మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఎటువంటి పార్టీ కార్యాలయం ఉండకుండా చూసుకోవాలన్నారు.

ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ క్రిటికల్, వనర్బులిటీ మ్యాపింగ్‌ను అధికారులు సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. ఓటు వేయడానికి వెళ్లే ఓటర్లను ఇబ్బందిపెడితే వారి సమాచారాన్ని తమ దృష్టికి తీసుకువస్తే తగు చర్యలు తీసుకుని నిష్పక్షపాతంగా ఓటింగ్ జరిగేందుకు సహకరిస్తామన్నారు. సెక్టార్ అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఏడు నియోజకవర్గాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ముక్కామలలో రాజీనామాను ప్రకటిస్తున్న చినబాబు

వైసీపీలో అసమ్మతి సెగ

- అంబాజీపేట మండల శాఖ అధ్యక్ష పదవికి చినబాబు రాజీనామా
- ఆయన రాజీనామా చేయకుండానే నూతన అధ్యక్షుడిని నియమించిన అధిష్ఠానం
- అనుచరులతో కలిసి త్వరలో కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడి

అంబాజీపేట, ఫిబ్రవరి 6: వైసీపీలో అసమ్మతి సెగ రాజుకుంది. పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మార్పు కారణంగా మండల శాఖ అధ్యక్షుడిగా వున్న వాసంశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు(చినబాబు) తన పదవికి రాజీనామా చేశారు. ముక్కామలలో జరిగిన కార్యక్రమంలో ఆయన తన అనుచరుల సమక్షంలో ఈ మేరకు ప్రకటించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు వైసీపీ టిక్కెట్టు ఇవ్వకపోతే తాను మండల శాఖ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానని ఇంతకు ముందే ప్రకటించానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావును ఇన్‌చార్జిగా అధిష్ఠానం ప్రకటించడంతో తాను రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచీ తాను వైసీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేశానన్నారు. 2019 ఎన్నికల్లో చిట్టిబాబు వెంటే ఉండి ఆయన ఎమ్మెల్యేగా గెలిచేందుకు నియోజకవర్గ స్థాయిలో తన వంతు పాత్ర పోషించినట్టు తెలిపారు. అయినప్పటికీ నియోజకవర్గంలోని వైసీపీ పెద్దలు, అధిష్ఠానం తనతో చర్చించపోవడం బాధాకరమన్నారు. అంతేగాక వేణుగోపాలరావు తనతో సంప్రదించకుండా ఏకపక్షంగా మండల శాఖకు నూతన అధ్యక్షుడిని నియమించడం దారుణమన్నారు. పార్టీలో కష్టపడి చేసిన తనకు విలువ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మారుతారా అని విలేకరులు ప్రశ్నించగా... తన అనచురులతో చర్చించి త్వరలో కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడించారు. అంతవరకు వైసీపీ నాయకుడిగా ఉంటానన్నారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వాసంశెట్టి రాంబాబు, నందుల ఆదినారాయణ, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంపీటీసీ వడలి కృష్ణమూర్తి, నాయకులు కాండ్రేగుల గోపాలకృష్ణ, ఉందుర్తి నాగబాబు, బండారు మల్లి, వాసర్ల మరిడి, ఉందుర్తి ఆనందబాబు, దొమ్మేటి నాగన్న, రాయుడు షణ్ముఖ్, అందె వెంకటముక్తేశ్వరరావు, కేతా రాజు, వాకపల్లి శ్రీను, రాయుడు కృష్ణమహేష్ తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ నులిపురుగుల నివారణ దినం

జిల్లాలో 3.06 లక్షల మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ లక్ష్యం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 6: జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని విజయవంతం చేసేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా సమన్వయ కమిటీ సభ్యులను జేసీ ఎస్.నుపూర్‌అజయ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సమన్వయ కమిటీ సమావేశాన్ని జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ నెల 9న జరిగే జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు. జిల్లాలో 3,06,833 మంది చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం లక్ష్యంగా నిర్దేశించామన్నారు. 9న వివిధ కారణాల వల్ల మాత్రలు తీసుకోని పిల్లలకు 16వ తేదీన విధిగా అందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డీఈవో ఎం.కమలకుమారి, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వై.సాంబమూర్తి, అదనపు డీఎంహెచ్‌వో సీహెచ్ వీ భరతలక్ష్మి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, ఆర్బీఎస్‌కే కో-ఆర్డినేటర్ జాన్‌లెవీ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ నులిపురుగుల దినోత్సవ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జేసీ నుపూర్‌అజయ్

జిల్లా రెవెన్యూ అధికారిగా

వెంకటేశ్వర్లు

అమలాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న సీహెచ్ సత్తిబాబును బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కలెక్టర్ హోదాలో సత్తిబాబును బాపట్ల జిల్లా డీఆర్వోగా నియమించారు. ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో మచిలీపట్నంలో పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లును కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో పరిపాలనాపరంగా ఈ ఆదేశాలు వెలువడ్డాయి. జిల్లా ఆవిర్భావం నుంచి సత్తిబాబు కోనసీమ డీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్నారు.

9న కలెక్టరేట్‌లో

జాబ్ మేళా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 6: జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం ఈ నెల 9న వికాస ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు వికాస జిల్లా మేనేజరు గోళ్ల రమేష్‌ను 9492722436 నెంబరులో సంప్రదించాలి.

గదిలో చదువు... వరండాలో వైద్యం

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విద్యాలయాలే నెలవయ్యాయి. ఆరోగ్య సురక్షలో భాగంగా మంగళవారం ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ పర్రపేట జగనన్న మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల వరండాలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లోపల గదిలో తరగతులు నిర్వహిస్తుండగా బయట వైద్య పరీక్షలు నిర్వహించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

- ఉప్పలగుప్తం



రేపు బ్రహ్మసమేధ్యంలో

చొల్లంగి తీర్థం

- 7లో



అమలాపురం డీఎస్పీగా

మహేశ్వరరావు

బాధ్యతల స్వీకారం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 6: అమలాపురం డీఎస్పీగా ఎం.మహేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి దిశ డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై అమలాపురం వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎం.అంబికా ప్రసాద్‌ను రాజమహేంద్రవరం సౌత్‌జోన్‌కు బదిలీ చేశారు.

రైతు బజార్లలో నిలకడ..
బహిరంగ మార్కెట్‌లో బాదుడు

- తేడాలు గమనించి విస్తుపోతున్న సామాన్యులు
- బెండ ధర పైపైకి.. మార్కెట్‌లో వెల్లుల్లి కిలో రూ.400





రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 6: కూరగాయల ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. బెండ ధర మినహా మిగిలిన వారి ధరలు ఫర్వాలేదనిపిస్తున్నాయి. అయితే ఇదంతా రైతు బజార్లలోనే..బహిరంగ మార్కెట్‌లో బాదుడు మామూలే.. వాస్తవానికి కొద్దిరోజులుగా కూరగాయల ధరల్లో నిలకడ కొనసాగుతోంది. గత నవంబరు, డిసెంబరులో కురిసిన వర్షాలకు కడియం, కడియపుసావరం, సీతానగరం, కూనవరం తదితర ప్రాంతాల్లో కూరగాయల పంటలు, పాదులు కుళ్లిపోయాయి. పంటలన్నీ పాడై పోవడంతో అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఏం కొనాలి, ఏం తినాలి అన్నట్టుగా సామాన్యులు, మధ్యతరగతి ప్రజల పరిస్థితి తయారైంది. ఆ తర్వాత కూరగాయలు సాగు చేసే రైతులు మళ్లీ నారు పోసి సాగు మొదలెట్టడంతో ఇప్పుడు అన్ని రకాల కూరగాయలు పుష్కలంగా దొరుకుతున్నాయి. అయితే, ధరల తగ్గుదల ప్రయోజనం రైతుబజార్లలో మాత్రమే దొరుకుతోంది. బహిరంగ మార్కెట్లలో ఎప్పటిలానే ధరల దోపిడీ కొనసాగడం గమనార్హం. రైతుబజార్లలోని రేట్ల కంటే రెట్టింపు ధరలకు బహిరంగ మార్కెట్లలో విక్రయాలు సాగుతున్నాయి. ఎప్పుడూ హై రేటు పలికే దొమ్మేరు వంకాయలు రైతు బజార్లలో కిలో రూ.32కే దొరకడం విశేషం. అలాగే రూ.100పైనే ఉండే చిక్కుడు కాయలు రూ.26, 38కే దొరుకుతున్నాయి. ఒక్క బెండకాయ ధర మాత్రం మెండుగా ఉంది. బెండకాయల ధర మాత్రం కిలో రూ.44 ఉంది. స్థానికంగా బెండకాయల దిగుబడులు అందుకోకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో వీటి ధరలు కాస్త ఎక్కువగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

బహిరంగ మార్కెట్లలో బాదుడే ..


రైతు బజార్లలో కూరగాయల ధరలు ఎంత తగ్గినా బహిరంగ మార్కెట్లలో మాత్రం బాదుడు కొనసాగుతోంది. రైతు బజార్లలోని రైతులు కొందరు కొన్ని రకాల పంటలు సాగు చేస్తుంటారు. ప్రధానంగా టమోట, కొన్ని రకాల వంకాయలు, బెండ, బీర, దొండ వంటివి పండిస్తారు. మరికొంతమంది అరటికాయలు, కాలీఫ్లవర్, పొట్లకాయలు, ఆనబకాయలు వంటివి సాగు చేస్తారు. కానీ, మార్కెట్ అవసరాలకు ఇవి ఏమాత్రం సరిపడవు. దీంతో వీళ్లు కూడా హోల్‌సేల్ మార్కెట్లను ఆశ్రయిస్తారు. రాజమహేంద్రవరంలో ప్రధానమైన రంభ-ఊర్వశి కూరగాయల మార్కెట్, రావులపాలెం సమీపంలోని మడికి, దొమ్మేరు వంటి మార్కెట్ల నుంచి బహిరంగ మార్కెట్లలోని వ్యాపారులు, రైతుబజార్లలోని రైతులు సరుకు తెచ్చుకుంటారు. కానీ, ధరల్లో మాత్రం రైతుబజార్లకు, బహిరంగ మార్కెట్లకు రెట్టింపు వ్యత్యాసం ఉంటోంది. దీంతో బహిరంగ మార్కెట్లు, చిల్లర మార్కెట్లలో కొనుగోలు చేసే పేదలు, సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉదాహరణకు రైతు బజార్లలో కిలో బెండకాయలు రూ.44గా ఉంది. ఇక్కడ ఇదే అత్యధిక ధర అనుకుంటే, బహిరంగ మార్కెట్లో మాత్రం బెండకాయల ధర రూ.80 వరకూ ఉంది. అలాగే, ఇతర కూరగాయల ధరలు రెట్టింపు పలుకుతున్నాయి. మార్కెట్లో ధరల పెరుగుదలను నియంత్రించాల్సిన మార్కెటింగ్ శాఖ, ఇతర అధికార వ్యవస్థలు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో తాము దోపిడీకి గురవుతున్నామనే భావన సామాన్యులు, మధ్యతరగతి ప్రజానీకంలో వ్యక్తమవుతోంది.

కన్నీళ్లు పెట్టిస్తున్న వెల్లుల్లి

వెల్లుల్లి ధర కన్నీళ్లు పెట్టిస్తోంది. వందా రెండొందలు కాదు ఏకంగా రూ.400కు పెరిగిపోయింది. పావుకిలో పాయలు కావాలంటే రూ.100 రూపాయలు ఇవ్వాల్సిందే.. వంటకాల్లో వెల్లుల్లి వేయడం అనేది సర్వసాధారణం. అలాంటిది ఇప్పుడు దాని ధర అమాంతం పెరగడంతో ఏం చేయాలో సామాన్యులకు తోచడం లేదు. వంద రూపాయలు పెట్టి పావు కిలో కొన్నా రెండు రోజులు, మూడు రోజులకు మించి రావు. దీంతో చాలా మంది తమ వంటకాల్లో వెల్లుల్లిని మినహాయిస్తున్నారు. దిగుమతుల ప్రభావంతో ధర పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు.



రేపు బ్రహ్మసమేధ్యం తీర్థం



కాట్రేనికోన, ఫిబ్రవరి 6: కాట్రేనికోన మండలం పల్లం గ్రామ శివారు సముద్రతీరాన బ్రహ్మసమేధ్యం ఉంది. ప్రతి ఏటా చొల్లంగి అమావాస్య రోజున ఇక్కడ తీర్థం జరుగుతుంది. చొల్లంగి రోజున సముద్ర స్నానాల కోసం జిల్లా వ్యాప్తంగా పలువురు ఇక్కడికి తరలి రావడం ఆనవాయితీ. ఈ నెల 8న బ్రహ్మసమేధ్యంలో చొల్లంగి తీర్థానికి భారీగా ఏర్పాట్లు చేశారు. ఆ రోజు తెల్లవారుజామున సముద్ర గర్భం నుంచి వచ్చే సూర్యోదయాన్ని తిలకించేందుకు భక్తులు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. సూర్యోదయ సుందర దృశ్యాన్ని వీక్షించిన అనంతరం సముద్రంలో స్నానమాచరిస్తారు. బ్రహ్మసమేధ్యంలో కాలభైరవస్వామి కొలువు తీరి ఉన్నాడు. ఈ ప్రదేశంలో ఆయన పాద ముద్రలు పురాణాలకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వీటిలో శంఖుచక్రాలు, వింజామరలు నేటికీ కనిపించడం ఈ క్షేత్ర ప్రసిద్ధికి తార్కాణం. చొల్లంగి అమావాస్య రోజున ఈ ఆలయ ఆవరణలో సంతానం లేని స్త్రీలు స్వామిని ఆరాధించి నిద్రిస్తే కలిగే స్వప్నంలో అరటి పండ్లు, కొబ్బరికాయలు, గుమ్మడి కాయలు కన్పిస్తే సంతానం కలుగుతుందని నమ్మకం. అమలాపురం డీఎస్పీ మహేశ్వరరావు ఆధ్వర్యంలో ముమ్మిడివరం సీఐ కొండయ్య, ఎస్‌ఐ నాగేశ్వరరావు తీర్థంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

11న వేమగిరిలో దళిత గర్జన సభ



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ శ్రీరాజ్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ ఫిబ్రవరి 6: దళితులను అన్నివిధాల మోసం చేసిన సీఎం జగన్‌కు ఈనెల 11న వేమగిరిలో నిర్వహించే దళిత సింహగర్జన సభ కనువిప్పు కలిగించబోతుందని అమలాపురం మాజీ ఎంపీ జీవి హర్షకుమార్ తనయుడు జీవీ శ్రీరాజ్ అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడిన దళిత జాతులకు మేలు చేస్తారని వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక జగన్ పూర్తిగా దళితులను నిర్లక్ష్యం చేశారన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి సబ్‌ప్లాన్ నిధులను నవరత్నాల పేరుతో దారి మళ్లించారని, మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్ అంటూ దళితులను విభజించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించారన్నారు. ఇప్పటికైన దళిత జాతి వర్గాలు మేల్కొని తమ నిరసన గళం వినిపించాలని శ్రీరాజ్ పేర్కొన్నారు. హర్షకుమార్ నేతృత్వంలో వేమగిరిలో జరిగే దళిత గర్జన సభలో దళితులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. దళిత నాయకులు వరిగేటి కిరణ్, కొమ్ము ప్రభాకర్‌రావు, తెనాలి కిరణ్, ఇందుగుమిల్లి చిరంజీవి, పసలపూడి పాపారావు, పొరోజు మాణిక్యాలరావు, తాతపూడి సత్యనారాయణ, పొరోజు చిరంజీవి పాల్గొన్నారు.

నేటి నుంచి పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల యాత్ర

9న కొవ్వూరులో రచ్చబండ.. అదేరోజు సాయంత్రం తునిలో రోడ్ షో



మాట్లాడుతున్న పీసీసీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పద్మశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 6: పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఈనెల 7నుంచి రాష్ట్రంలో యాత్ర చేపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ తెలిపారు. రాజమహేంద్రవరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 7న బాపట్ల నుంచి యాత్ర ప్రారంభిస్తారని, ఈ యాత్ర ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో రూరల్ ప్రాంతాల మీదుగా సాగుతుందన్నారు. 8న సాయంత్రం ఏలూరు జిల్లా దెందులూరుకు చేరుకుని రోడ్ షో నిర్వహిస్తారని, అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. 9న ఉదయం కొవ్వూరు చేరుకుని అక్కడ రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. బడుగు బలహీనవర్గాల సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. అనంతరం అదే రోజు సాయంత్రం కాకినాడ జిల్లా తునిలో రోడ్‌షో నిర్వహించి బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. ఈ యాత్రలో షర్మిళారెడ్డి వెంట సీడబ్ల్యుసీ సభ్యులు రఘువీరారెడ్డి, పల్లంరాజు, రుద్రరాజు, కేవీపీ రామచంద్రరావు తదితర ముఖ్య నేతలు ఉంటారని చెప్పారు. షర్మిళారెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు కావడం తట్టులోక ఓటమి భయంతో గజదొంగలు ఏ1 జగన్, ఏ2 విజయసాయిరెడ్డి దొంగల ముఠా తప్పుడు ఆరోపణలు చేస్తోందని పద్మశ్రీ మండిపడ్డారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు, 25 ఎంపీ స్థానాల్లోను కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని పద్మశ్రీ స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, పీసీసీ ప్రధాన కార్యదర్శులు బోడా వెంకట్, ముళ్ళ మాధవ్, పెదిరెడ్డి సుబ్బారావు, తాళ్ళూరి విజయకుమార్, చిన్నం మురళీకృష్ణ, వైఏ వడయార్, గడ్డం సాయిబాబా, మహ్మద్ అమర్జహ బేగం, మార్టిన్ లూథర్ పాల్గొన్నారు.

370 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

జగ్గంపేట, ఫిబ్రవరి 6: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని రామవరం జాతీయ రహదారిని ఆనుకున్న హర్యానా రాజస్థాన్ దాబా హోటల్ వద్ద ఒక కంటైనర్ లారీలో ప్రత్యేక అరలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని జగ్గంపేట సీఐ లక్ష్మణరావు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ తెలిపిన వివరాలు ప్రకారం.. హరియాణాకు చెందిన ఇబ్రహీం, జున్స్‌లు ఒడిసాలోని చిత్రకొండ గ్రామంలో మోటూ అనే వ్యక్తి వద్ద 370 కిలోల గంజాయిని కొనుగోలు చేసి తరలిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. మోటు ఈ గంజాయిని ముందు రోజు గండేపల్లి మండలం మురారి గ్రామంలోని పోలవరం కెనాల్ వద్ద తీసుకువచ్చి తుప్పల్లో దాచి ఇద్దరు వ్యక్తులకు సరుకు అప్పగించారన్నారు. ఇబ్రహీం, జున్స్‌లు మహారాష్ట్రకు చెందిన సీక్రెట్ అరతో కూడిన కంటైన్ లారీలో ఈ గంజాయి నింపుకుని తరలిస్తుండగా మార్గం మధ్యలో లారీ మరమ్మత్తులకు గురవడంతో రామవరం దాబా వద్ద రిపేరు చేయిస్తుండగా జగ్గంపేట ఎస్‌ఐ నాగార్జునరాజు సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని 370 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 3 సెల్‌ఫోన్లు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. మోటూ పరారీలో ఉన్నాడని త్వరలో అతన్ని అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు.

చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్రతో సమగ్ర అధ్యయనం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్బతి ఫణీశ్వరరావు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 6: చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్ర ద్వారా రాష్ట్రంలో ఉద్యోగ, కార్మిక, భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలను అధ్యయనం చేసి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు నివేదించనున్నట్లు టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు చెప్పారు. బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ముమ్మిడివరంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు స్వగృహం వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో ఫణీశ్వరరావు మాట్లాడుతూ జనవరి 6వ తేదీన శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం నుంచి ప్రారంభమైన బస్సుయాత్ర ఈ నెల 4న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంతో ముగిసిందన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో 3347 కిలోమీటర్లు మేర బస్సుయాత్ర సాగిందని, ఈ బస్సు యాత్ర ద్వారా రాష్ట్రంలోని అన్ని రంగాల్లోను ఉద్యోగులు, కార్మికుల సమస్యలను గుర్తించామన్నారు. 2024 ఎన్నికల్లో టీఎన్‌టీయూసీకి ఒక ఎమ్మెల్యే సీటు కేటాయించాలని రాష్ట్ర నాయకత్వం ప్రతిపాదించి టీడీపీ అధిష్ఠానానికి నివేదించినట్లు చెప్పారు. టీఎన్‌టీయూసీ తరఫున అభ్యర్థిగా తన పేరును సూచించినట్లు కూడా ఫణీశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫణీశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షుడు కుసుమ సూర్యమోహనరావు, యర్రమోతు ధర్మరాజు, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గ అధ్యక్షుడు వలవల శివరావు, నక్కా రామకృష్ణ, ముమ్మిడివరం ప్రధాన కార్యదర్శి బూరగ శ్రీనివాస్ కల్యాణ్, నాయకులు గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, మెండి కమల, యాళ్ల ఉదయ్, సబ్బతి రాంబాబు, గెడ్డం శ్రీనివాసరావు, పాయసం చిన్నీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

18న రికార్డు అసిస్టెంట్లకు పరీక్ష

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కరోనా విపత్తు కారణంగా నోటిఫికేషన్ నెం.1/2019కి సంబంధించి వాయిదా పడిన రెండు రికార్డు అసిస్టెంట్ పోస్టులకు రాత పరీక్షను ఈ నెల 18న నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. గోకవరం బస్టాండ్ సమీపంలోని రాజమహేంద్రి డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్ష కోసం షార్ట్ చేసిన జాబితాలో ఉన్న అభ్యర్థులకు రిజిస్టరు పోస్టు ద్వారా హాల్ టికెట్లు పంపించామని, అయితే ఆ చిరునామాలో లేకపోవడంతో కొన్ని వెనక్కు తిరిగి వస్తున్నాయన్నారు. అలాంటి వారు రాజమహేంద్రవరంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఏజెన్సీలో చికెన్‌సెల్ గుర్తించేందుకు నమూనాల సేకరణ



సమీక్ష నిర్వహిస్తున్న సూరజ్ గనోరే

రంపచోడవరం, ఫిబ్రవరి 6: ఏజెన్సీలో చికెన్ సెల్ వ్యాధి ఉన్నవారిని గుర్తించేందుకు రక్త నమూనాలను స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు.ఐటీడీఏ కార్యాలయం సమావేశపు హాలు నుంచి మంగళవారం ఆయన వైద్యాధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రతి గ్రామం, పాఠశాలల్లో చికెన్ సెల్ పరీక్షలు నిర్వహించేందుకు 79,425 కిట్లు వచ్చాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చికెన్ సెల్ బాధితులకు పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, వైద్యాధికారులు రాధిక, కెల్విన్, సాహిని, ఎంపీహెచ్‌వో పీటర్, జీసీసీ డీఎం పార్వతీశ్వరరావు, ఏపీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతుల నుంచే పరిశోధనలు మొదలవ్వాలి



రైతులకు బదనికలు అందిస్తున్న సుషీల్

అంబాజీపేట, ఫిబ్రవరి 6: రైతుల భాగస్వామ్యంతో వ్యవసాయ ఉద్యాన పరిశోధనలు, ప్రయోగాలు జరగాల్సి ఉందని అఖిల భారత జీవ నియంత్రణ సమన్వయ పథకం డైరెక్టర్ అండ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎస్ సుషీల్ అభిప్రాయపడ్డారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలు రైతులకు ఎప్పటికప్పుడు తెలియచేయాలన్నారు. జీవ నియంత్రణ బదనికలను ఉపయోగించడం వల్ల ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించవచ్చునన్నారు. స్థానిక పరిశోధన కేంద్రంలో జీవ నియంత్రణ ప్రయోగశాలలు, పరిశోధనలు పరిశీలించారు. బదనికల తయారీ, వినియోగం గురించి పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు సుషీల్‌కు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక పరిశోధన కేంద్రంలో ఉత్పత్తి చేస్తున్న బదనికలు, జీవనియంత్రణ శిలింధ్ర నాశినలను రైతులకు సుషీల్ అందించారు. అనంతరం గోదావరి ఇంటిగ్రేటెడ్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఛైర్మన్ కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి, వైఎస్సార్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు పరిశోధన కేంద్రంలో సుషీల్‌ను కలిశారు. గిఫ్ట్ కంపెనీ ఎఫ్‌పీవో ద్వారా బయలాజికల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి రూగోస్ నివారణకు బదనికలు తయారు చేయనున్నట్లు వివరించారు. రైతు ఉత్పత్తిదారు సంస్థ ద్వారా బదనికలు తయారు చేసే తొలి బయలాజికల్ ల్యాబ్ ఇదేనన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ జి.శివకుమార్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.శ్రీదేవి, కొవ్వూరు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ జి.రామానందం, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, వి.అనూష, ఎ.కిరీటి పాల్గొన్నారు.

కోతి దాడిలో పలువురికి గాయాలు



గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 6: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కోతి(అలంబండ) పలువురిపై దాడి చేసి విచక్షణారహితంగా కరవడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చేదులూరి సత్యవేణికి తీవ్రంగా గాయాలు కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని స్థానికంగా ఉన్న ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. గొల్లప్రోలు జడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగలోవరాజు విషయాన్ని కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె అటవీశాఖ అధికారులతో మాట్లాడారు. బవురువాక, అగ్రహారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు వై.బాబూరావు, పి.లావణ్య తదితరులు బాధితులను పరామర్శించారు. కోతుల కోసం గాలింపు చేపట్టారు.

లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం పొందే అర్హత ఉన్న సమస్యలను గుర్తించి సదరు జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల వారూ రాజీ మార్గం ద్వారా అంగీకారయోగ్యమైన పరిష్కారాన్ని సత్వరమే పొందవచ్చన్నారు. సమావేశంలో మునిసిపల్, కార్మిక, విద్యుత్, టెలికాం, బ్యాంకింగ్, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్‌ఫండ్స్ శాఖల అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) డైరీని కోర్టు ఆవరణలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు, రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీవీటీ రాజు, ప్రధాన కార్యదర్శి కవి హనుమంతరావు, న్యాయవాదులు సురేశ్, కె.సోమశేఖర్, ఎన్.లక్ష్మణరావు, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక వివక్షను రూపుమాపడానికి సాగుతున్న ఉద్యమాలకు కరదీపికగా ఈ డైరీ ఉపయోగపడుతుందని ప్రశంసించారు. దేశంలో అన్ని వర్గాల వారూ కలిసిమెలిసి ఉంటే దేశం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. పేదల కోసం పోరాడే కమ్యూనిస్టులు, దళిత సంఘాలు.. 'లాల్ నీల్' ఏకమై పోరాడినప్పుడే దళిత హక్కుల పరిరక్షణ జరుగుతుందని అన్నారు.

ఆర్టీసీ బస్సులో డీజిల్ చోరీ

తుని రూరల్, ఫిబ్రవరి 6: కాకినాడ జిల్లా తుని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో డీజిల్ చోరీకి గురైంది. తుని నుంచి రౌతులపూడికి స్కూల్ పిల్లలతో వెళ్లిన ఏపీ 29జెడ్ 0490 ఆర్టీసీ బస్సు రౌతులపూడిలో పోలీస్‌స్టేషన్ దగ్గరలో పార్కింగ్ చేసి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు ఆయిల్ ట్యాంకర్ తాళం పగలకొట్టి సుమారు 250 లీటర్ల డీజిల్ చోరీకి పాల్పడ్డారు. అయితే చోరీకి గురైన డీజిల్‌ను బస్సు డ్రైవర్‌ను నుంచి రికవరీ చేసి విషయాన్ని గోప్యంగా ఉంచేందుకు డిపో అధికారులు పూనుకున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా పార్కింగ్ చేసిన వాహనాల్లో ఇంధనం మాయమవడం, వాహనాల బ్యాటరీలు చోరీకి గురవడం పరిపాటిగా మారిందని పలువురు అంటున్నారు.

ఆర్టీసీ బస్సు దిగుతూ కిందపడి వ్యక్తి మృతి

కొత్తపల్లి/జీజీహెచ్,ఫిబ్రవరి 6: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్ దిగుతూ జారి పడిన సంఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. ఉప్పాడకు చెందిన రెడ్నం సత్యనారాయణ(73) కిరాణా వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. మంగళవారం మధ్యాహ్నం వ్యాపారం నిమిత్తం సరుకుల కొనుగోలుకు కాకినాడ వెళ్లి ఉప్పాడ తిరుగు ప్రయాణమయ్యారు. ఉప్పాడలో బస్ దిగుతూ జారిపడి తీవ్రగాయాలపాలయ్యారు. వెంటనే అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించే క్రమంలో సత్యనారాయణ మార్గ మధ్యంలో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది జైలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 6: కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన టాక్సీ డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పిఠాపురం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.లీలాసాయిసుభాష్ తీర్పు చెప్పారు. శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన సలపరెడ్డి పాండురంగారావు(38) ఒక మహిళతో మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా, గొల్లప్రోలు మండలం కొత్త వజ్రకూటం వద్ద రాజమహేంద్రవరం నుంచి కత్తిపూడి వెళుతున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో పాండురంగారావుతో పాటు గుర్తు తెలియని మహిళ మరణించారు. 2018 ఏప్రిల్ 3న సంఘటన జరగగా అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమయిన విశాఖ జిల్లా గోపాలపట్నానికి చెందిన కారు డ్రైవర్ సలపు సత్తిబాబును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాలు అనంతరం నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ ఆకుల నాగలీలా రోజా ప్రాసిక్యూషన్ నిర్వహించగా, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ బాలాజీ, కోర్టు కానిస్టేబుల్ వై.రాజాబాబులు సాక్షులను హాజరు పరచడంలో సహకరించారు.

ఓఎన్జీసీ ప్రతినిధులను కలిసిన జేఏసీ

యానాం, ఫిబ్రవరి 6: యానాంలో మత్స్యకారులకు రావలసిన ఓఎన్జీసీ పరిహారానికి సంబంధించి యానాం జేఏసీ ప్రతినిధులు బృందంకాకినాడ వెళ్లి ఓఎన్జీసీ ప్రతినిధులను కలిశారు. వారికి వినతిపత్రం అందజేశారు. పుదుచ్చేరి మత్స్యశాఖ నిర్ధారించిన 5,462మంది లబ్ధిదారులకు పార్లమెంట్ ఎన్నికల ముందుగానే పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతినిధులు మల్లాడి సత్తిబాబు, గుత్తుల రామరావు, మల్లాడి బీరాస్వామి, కనకాల రాజు, పెసింగి శ్రీను, లంక బంగారం పాల్గొన్నారు.

ఊరుకాని చోట నివాసయోగ్యం కాని స్థలాలు

నిరుపేదల ఆశలతో ప్రభుత్వం చెలగాటం

కొత్తపేట, ఫిబ్రవరి 6: జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన లబ్ధిదారులు సర్వర్లు పనిచేయకపోవడంతో పంచాయతీల వద్ద పడిగాపులు పడుతున్నారు. ఊరికాని చోట నివాసయోగ్యం కాని స్థలాలు కేటాయించడంతో నిరుపేదల ఆశలతో ప్రభుత్వం చెలగాటమడుతోంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు జగన్ ప్రభుత్వం ఇళ్ల ఇచ్చిందని గుర్తుపోయిండేలా పలుదశల్లో ప్రచార ఆర్భాటాలకు తెరలేపింది. అందులో భాగంగా ఊరి కాని చోట పనికిరాని స్థలాలు.. అవికూడాఎక్కడ ఉన్నాయో లబ్ధిదారులకు తెలియకుండానే పట్టా కాగితాలు పంపిణీ చేశారు. మరోసారి ఆ పట్టా స్థలాల అప్పగింత కార్యక్రమంటూ స్థానిక ప్రజాప్రతినిధి హంగామా సృష్టించారు. ఇప్పుడేమో ఆ పట్టాలకు రిజిస్ట్రేషన్ అంటూ లబ్ధిదారులను కాళ్లరిగేలా తిప్పుతున్నారు. అయినా ఇప్పటి స్థలాలు ఎక్కడ..! నివాసయోగ్యమైనవా..! ఇళ్లు కట్టుకునే సౌకర్యాలు ఉన్నాయా అని నేటికీ లబ్ధిదారులకు తెలియని అయోమయ పరిస్థితులు ఉన్నాయి. ఇదిలా ఉండగా కొత్తపేట మండలానికి సంబంధించి 4,050మందికి పట్టాలు మంజూరు కాగా కొన్ని కారణాలవల్ల 3,500మందికి మాత్రమే పంపిణీ చేశారు. అందులో కొత్తపేట మేజర్‌పంచాయతీ పరిధిలో 1,050పట్టాలు పంపిణీ చేశారు. మండలంలోని 10గ్రామాలకు వాడపాలెం, మందపల్లిగ్రామాల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు స్థలాలు లేకపోవడంతో వారికి వేరేగ్రామాల్లో పట్టాలు ఇచ్చారు. కొత్తపేటకు సంబంధించి కొందరికి అవిడి, మోడేకుర్రు గ్రామాల్లో పట్టాలు ఇచ్చారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఆయా గ్రామాల పరిధిలో వీఆర్వోలు, కార్యదర్శులు రిజిస్ట్రేషన్ తతంగాన్ని పూర్తిచేస్తే కొత్తపేట సబ్‌రిజిస్ట్రార్ ఆమోదించాల్సిఉంది. లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ కోసం పడిగాపులు పడుతున్నారు. చంటిపిల్లలతో ఇబ్బందులు పడుతూ ఏం స్థలాలు మహాప్రభోఅంటూ ఆవేదనవ్యక్తంచేస్తున్నారు. ఇళ్లు కట్టుకునేందుకు వీలుగా కనీస సౌకర్యాలు కల్పించి తమ స్థలాలు తమకు అప్పగించాలని వేడుకుంటున్నారు.



ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కోసం కొత్తపేట పంచాయతీ వద్ద వేచియున్న లబ్ధిదారులు

రాగూర్‌కు భారతరత్నపై హర్షం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 6: కర్పూరీఠాగూర్‌కు భారతరత్న ప్రకటించడంపై నాయీబ్రాహ్మణ సంఘం హర్షం వ్యక్తం చేసింది. రామేశ్వరపు శ్రీనివాస్ అధ్యక్షతన ఐ.పోలవరంలో మంగళవారం సంఘ సమావేశం జరిగింది. సామాన్య నాయీబ్రాహ్మణ రైతు కుటుంబంలో జన్మించిన ఠాగూర్ జననాయకుడుగా ఎదిగారని సమావేశం కీర్తించింది. సమావేశంలో కేటీ శ్రీనివాస్, రామేశ్వరపు శేషగిరి, విదులూరి కాళహస్తి, పేకేటి సత్యనారాయణ, మహేంద్రవాడ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

8వ ప్రవక్తకు ఘన నివాళి

మామిడికుదురు, ఫిబ్రవరి 6: ముస్లిం మతస్తుల 8వ ప్రవక్త ఇమామ్ మూసాయే ఖాజింకు ముస్లింలు మంగళవారం ఘన నివాళులర్పించారు. నగరం మంచిలే కర్బలాలోని నిజీబ్ బాబు ఆధ్వర్యంలో మజ్లిస్ జరిగింది. ఇమామ్‌పై జరిగిన అకృత్యాలు, ఆనాటి దాడులను మజ్లిస్ రూపంలో మత ప్రబోధకులు మహ్మద్ఇబ్రహీం వివరించారు. అనంతరం బానకగూ ఫాతిమా పంజా నుంచి మాతం నిర్వహిస్తూ ఊరేగింపు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఇమామ్‌కు కన్నీటి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సిరాజ్ మహేంద్రాణే ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది.

నులిపురుగుల నివారణపై అవగాహన

పి.గన్నవరం, ఫిబ్రవరి 6: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాగుల్లంక ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ షేక్ జాసిమ్ అధ్యక్షతన నులిపురుగుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల9న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 11,984మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. ఎంపీడీవో త్రిశూలపాణి, సీడీపీవో జయశ్రీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలి

మలికిపురం, ఫిబ్రవరి 6: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.15వేలు జీతం ఇవ్వాలని మంగళవారం గుడిమెళ్లంకలో జరిగిన సంఘ సమావేశంలో తీర్మానించారు. మంగళవారం మధ్యాహ్న భోజనం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు మాట్లాడారు. కార్మికుల సమస్యలను సీఎం పరిష్కరించాలని కోరారు. మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు మండలాల అధ్యక్షులు నాగిరెడ్డి వెంకటరామకృష్ణ, పినపోతు శశిరేఖ, జి.రమాదేవి, కె.దుర్గాభవానీ, నల్లి సుమతి, దొడ్డా దుర్గాభవానీ పాల్గొన్నారు.

దళిత సింహగర్జనను జయప్రదం చేయాలి

మలికిపురం, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న హత్యాకాండలకు నిరసనగా ఈనెల11న రాజమహేంద్రవరంలో జరిగే దళిత సింహగర్జనను విజయవంతం చేయాలని మంగళవారం మలికిపురంలో జరిగిన సమావేశంలో పలువురు వక్తలు కోరారు. తోటె ప్రతాప్, గెడ్డం ఫిలిప్‌రాజు, దేవర రాజేంద్రప్రసాద్, గెడ్డం ప్రభాకర్, జంపన ప్రసాదరావు, దీపాటి గంగాచలం, సరెళ్ల శివ, నల్లి బుజ్జిబాబు, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

పేబ్యాక్ టుద సొసైటీ కార్యక్రమం

రాజోలు, ఫిబ్రవరి 6: పొన్నమండ జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.రోహిణి అధ్యక్షతన దళిత చైతన్యవేదిక ఆధ్వర్యంలో పేబ్యాక్ టుద సొసైటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. దళిత చైతన్యవేదిక నాయకులు సమకూర్చిన పెన్నులు, ప్యాడ్స్, పెన్సిళ్లు తదితర వాటిని పదోతరగతి విద్యార్థులు 73మందికి వైస్‌ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, గుబ్బల శ్రీనివాస్, కుసుమ రాజ్‌కుమార్ పంపిణీ చేశారు. దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, బత్తుల జనార్ధనరావు, చిలకపాటి శ్రీధర్, బొడ్డపల్లి పుల్లయ్య పాల్గొన్నారు.

ఏఎన్ఎంకు సన్మానం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 6: విశిష్ట సేవలందించిన ఏఎన్ఎం పెంకే సుమలతను మంగళవారం అంగర పీహెచ్‌సీలో వైద్యాధికారి డా. పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అధ్యక్షతన ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీడీవో ఎం. రామకృష్ణారెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి టి. సుభాకర్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సేవలపై కళాజాత

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 6: నేలటూరు, వల్లూరు, మాచర, వడ్లమూరు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలు, పూర్వప్రాథమిక విద్యపై మంగళవారం సన్‌గ్రూప్, క్రై బెంగళూరు సౌజన్యంతో ఆలమూరు శ్రమస్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. సర్పంచ్‌లు, సచివాలయం, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, బాలబాలికలు పాల్గొన్నారు.

పి.గన్నవరం ఎస్ఐగా శివకృష్ణ

పి.గన్నవరం, ఫిబ్రవరి 6: పి.గన్నవరం ఎస్‌గా బి.శివకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండపేట రూరల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఎస్ఐకు సిబ్బంది, పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన హరికోటి శాస్త్రి మండపేట టౌన్ ఎస్ఐగా వెళ్లారు.

కోడి పందేలపై పోలీసుల దాడి: ఆరుగురి అరెస్టు

రాయవరం, ఫిబ్రవరి 6: రాయవరంశివారు ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఆరుగుర్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ జి.నరేష్ మంగళవారం తెలిపారు. 2కోళ్లు, 2కత్తులు, రూ.2,100 నగదు స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టుతెలిపారు.

సర్పంచ్‌ల హౌస్ అరెస్టు అన్యాయం

అల్లవరం, ఫిబ్రవరి 6: అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న సర్పంచ్‌లను పోలీసులు హౌస్‌అరెస్టు చేయడం అన్యాయమని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు ఆరోపించారు. బోడసకుర్రు, గోడి, గోడితిప్ప, తదితర సర్పంచ్‌లను హౌస్ అరెస్టుచేయడంపై సర్పంచ్‌ల సమాఖ్య ఆవేదన వ్యక్తం చేసింది.

టీడీపీని గెలిపించి.. జగన్ పాలనను సాగనంపండి



ఆర్య వైశ్య సంఘ సభ్యులతో రెడ్డి సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం, ఫిబ్రవరి 6: తెలుగుదేశాన్ని గెలిపించండి, జగన్‌రెడ్డి రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడండి అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆ సంఘ పెద్దలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగుదేశం పార్టీని ప్రజలు గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఒక్క చాన్స్ ఇచ్చినందుకే జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని దోచుకున్నాడని, మరో చాన్స్ ఇస్తే రాష్ట్ర ప్రజలు ప్రక్క రాష్ట్రాలకు తరలి వెళ్లిపోవాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మున్సిపల్ మాజీ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్య వైశ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం కోసం వెళితే పట్టించుకోవడంలేదు

అంబాజీపేట, ఫిబ్రవరి 6: జగనన్నసురక్ష వైద్య శిబిరాల్లో మెరుగైన వైద్యంఅందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గంగలకుర్రు అగ్రహారం పంచాయతీ వద్ద జగనన్న సురక్ష క్యాంపు మంగళవారం నిర్వహించారు. గత ఏడాది అక్టోబరులో గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్షలో తన భార్య ధనలక్ష్మి పరీక్షలు చేయించుకోగా మెరుగైన వైద్యంకోసం అమలాపురంఆసుపత్రికి వెళ్లమని సూచించారని, అయితే అక్కడ పట్టించుకోలేదని గ్రామానికి చెందిన సంసాని రామకృష్ణ ఆరోపించారు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నామన్నారు. స్థానిక వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు ఇబ్బందులకు గురిచేయడంతో ఏరియా ఆసుపత్రిలోనే వైద్యంచేయిం చుకున్నట్టు వేలిముద్ర వేయాల్సి వచ్చిందని ప్రజాప్రతినిధులను రామకృష్ణ నిలదీశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని వైద్యాధికారి వి.గౌతమి తెలిపారు.



ప్రజాప్రతినిధులను నిలదీస్తున్న రోగి బంధువులు

పర్యాటక బోట్లు తొలగించాలి

అంతర్వేది, ఫిబ్రవరి 6: అంతర్వేది పల్లిపాలెం ఫిషింగ్ హార్బరు సమీపంలో అనుమతులు లేకుండా పర్యాటక బోట్లను నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అనుమతులులేని బోట్లను తొలగించాలని కోరుతూ పర్యాటక, కోర్టు, జలవనరులు, కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

అవార్డు గ్రహీతలకు ఘనసన్మానం

అల్లవరం, ఫిబ్రవరి 6: గోడిలంక పంచాయతీ వద్ద సర్పంచ్ రుద్రరాజు పవిత్ర ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం జరిగింది. ఖమ్మం జిల్లాలోని గిరిజన గ్రామాల్లో నర్సుగా వైద్య సేవలందించి రాష్ట్రపతి నుంచి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న పెనుమాల సుశీలను సన్మానించారు. ఉభయతెలుగు రాష్ట్రాల స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ద్వితీయ విజేత దారా గాయత్రిని సత్కరించారు. ఉత్తమ సేవా అవార్డు గ్రహీత అల్లవరం ఎంపీడీవో కృష్ణమోహన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రుద్రరాజు లక్ష్మీపతిరాజు, ఆర్.దత్తుడురాజు, నాతి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, శెట్టిబత్తుల తులసీదుర్గారావు, కుంచే చంద్రరావు, కాశీ అమ్మాజీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరాలు వెలవెల



మామిడికుదురు, ఫిబ్రవరి 6: జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరాలు ప్రజా స్పందన లేక వెలవెలబోతున్నాయి. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరం పెదపట్నంలంకలో మంగళవారం జరిగింది. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పరీక్షలు చేశారు. మధ్యాహ్నం నుంచి వైద్య శిబిరం వెలవెలబోయింది. పీహెచ్‌సీలో ఇస్తున్న మందులే ఇక్కడ ఇస్తుండటంతో ప్రజలు ఆసక్తిచూపడం లేదు.

ఓపీఎస్‌ను కొనసాగించే ప్రభుత్వానికే మద్దతు

కొత్తపేట, ఫిబ్రవరి 6: సీపీఎస్, జీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేసే ప్రభుత్వానికే మద్దతని యూటీఎఫ్ మండలశాఖ పేర్కొంది. ఎమ్మార్సీభవనం ముందు 'ఓట్ ఫర్ ఓపీఎస్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజకీయ పార్టీలకు పాతపెన్షన్ అమలుపై పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. యూటీఎఫ్ నాయకులు వై.మురళి, టి.విజయకృష్ణ, సూర్యారావు, రామ్‌కుమార్, భాస్కరశాస్త్రి, జయావతి, ఎస్‌.శైలజ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యకరమైన పంటలు

అంబాజీపేట, ఫిబ్రవరి 6: రసాయనిక ఎరువులు వినియోగించడం ద్వారా భూమి స్వభావం దెబ్బతినడంతో పాటు నీటి కాలుష్యం అవుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జె.ఎలియాజర్ తెలిపారు. ఇంటర్నేషనల్ వరి పరిశోధన స్థానం, గ్లోబల్ మార్కెటింగ్ ప్రతినిధులు, జర్మని బృందం వక్కలంకలో వరిపొలాలను సందర్శించారు. రసాయనిక పురుగుమందులతో వ్యవసాయంచేస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయం చేపట్టిన రైతులతో జర్మని బృందం సభ్యులు మాట్లాడారు. రసాయనిక ఎరువులతో వ్యవసాయం చేపట్టే వివరాలు, నీటి వినియోగం, సాగు ఖర్చు, ఆదాయాలపై చర్చించారు. రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్‌టెంట్ డీవీ రాయుడు మాట్లాడుతూ ప్రకృతి విపత్తులకు ఏకైక మార్గం ప్రకృతి వ్యవసాయమన్నారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులు ఏ గ్రేడ్ మోడల్‌లను ఎలియాజర్ జర్మని బృందానికి వివరించారు. రైతు సాధికార సంస్థ ప్రతినిధులు డాక్టర్ రాయుడు, డాక్టర్ జాకీర్ హుస్సేన్, అరుణ, అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, ఏవో శ్రీనివాస్, జర్మని బృంద సభ్యులు సుహెలఖాన్, మాళవిక గోపినాథ్, సాయికిషోర్, సౌమిత చక్రవర్తి, నవీన్‌హెరి, రాకేష్, మహిదర్, అంకితపాల్, విక్రమ్‌పాటిల్, అంతోని, శరణ్యా హాజరిక, సుదర్శన్ ఖకుర్, మధబరంద్రరాయ్, సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



వక్కలంకలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న జర్మని బృందం

కోనసీమ వేదశాస్త్ర సన్మానసభకు రూ.8లక్షలు విరాళం



రూ.8లక్షలు విరాళం అందజేస్తున్న కామేశ్వరీదేవి, సన్యాసిరామ్ దంపతులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 6: 1963లో ప్రారంభమైన శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మానసభకు కెనడాలో స్థిరపడ్డ ప్రయాగ కామేశ్వరీదేవి, సన్యాసిరామ్ కుటుంబసభ్యులు మంగళవారం రూ.8లక్షల చెక్కు అందజేశారు. వేదశాస్త్ర సన్మాన సభకు ప్రారంభ అధ్యక్షునిగా పనిచేసిన డాక్టర్ కూరెళ్ల హరిహరస్వామి మనుమరాలైన కామేశ్వరీదేవి వేదశాస్త్రాల పట్ల మక్కువతో వేద పండితులను గౌరవించాలన్న లక్ష్యంతో హరిహరస్వామి-గాయత్రీదేవి దంపతుల పేరిట ఈమొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో సన్మాన సభ ఉపాధ్యక్షుడు వంక విద్యాశంకర్, కార్యదర్శి గుళ్లపల్లి వేంకటరామ్, కోశాధికారి యేడిద సుబ్రహ్మణ్యశర్మ, శిష్టా భాస్కర్, శిష్టా కుమారశాస్త్రి, శిష్టా రామగోపాలం తదితరులు పాల్గొని కామేశ్వరీదేవి దంపతులను సత్కరించారు.

ఫైర్ ఇంజన్ వాహనం అందజేసిన గెయిల్

మండపేట,ఫిబ్రవరి 6: మండపేట ఫైర్‌స్టేషన్‌కు రూ.40లక్షలు విలువైన నూతన అగ్నిమాపక వాహనాన్ని గెయిల్ ఇండియా కార్పొరేషన్ సంస్థ ప్రతినిధులు కె.వి.ఎస్.రావు, వై.ఎ.కుమార్, కె.బి.నారాయణ, ప్రభాకర్, బాలాజీలు మంగళవారం జిల్లా అగ్నిమాపక అధికారి ఎన్.పార్థసారధికి అందజేశారు. కార్యక్రమంలో మండపేట ఫైర్ స్టేషన్ అధికారి హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పవన్‌ను విమర్శించే అర్హత చంద్రశేఖర్‌రెడ్డికి లేదు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 6: కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను విమర్శించే స్థాయి, అర్హత లేదని జనసేన పార్టీ పీఏసీ కమిటీ సభ్యుడు పితాని బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేన, టీడీపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ద్వారంపూడి అవినీతి చిట్టా అంతా తమ వద్ద ఉందని, తాము అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మునంతా కక్కించి ప్రజల ముందు పెడతామన్నారు. వైసీపీ నాయకులు ఓటమి భయంతో అభద్రతా భావంతో అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు.

ఓఎన్జీసీ గేటు వద్ద కార్మికుల ధర్నా

అల్లవరం, ఫిబ్రవరి 6: కృష్ణగోదావరి బేసిన్ పరిధిలోని అల్లవరం మండలం ఓడలరేవులో టాటా కంపెనీ ఆధ్వర్యంలో సబ్ కాంట్రాక్టర్లు కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో వారు రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు. 80 మంది కార్మికులు ఓఎన్జీసీ ప్లాంటు గేటు ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఓఎన్జీసీ ప్లాంటు నిర్మాణంలో తమ శ్రమను దోచుకుంటున్నారని వివరించారు. టాటా కంపెనీ ఆర్‌పీఎంతో పాటు హెచ్‌ఆర్ సతీష్ కార్మికులతో చర్చలు జరిపారు. ఈనెల17వ తేదీన వారికి జీతాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైసీపీ మండల శాఖ అధ్యక్షుడిగా శేఖర్

అంబాజీపేట, ఫిబ్రవరి 6: వైసీపీ మండల శాఖ అధ్యక్షుడిగా గంగలకుర్రు అగ్రహారానికి చెందిన విత్తనాల శేఖర్ నియమితులయ్యారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ సతీష్‌కుమార్ నుండి ఉత్తర్వులు అందుకున్నట్టు ఆయన తెలిపారు. వైసీపీ శ్రేణులు అభినందించారు.

బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై ఫిర్యాదు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 6: సమాచార హక్కు చట్టం ముసుగులో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను బెదిరిస్తూ సొమ్ములు దోచుకుంటున్న వ్యక్తిపై మండల సర్పంచ్‌లు మంగళవారం అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధుల విషయంపై చర్చించేందుకు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు అమలాపురం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో ఆర్టీఐ కార్యకర్త ఒక మహిళతో కలిసి వచ్చారు. ఎంపీడీవో జొన్నాడ వెంకటేశ్వరరావుతో సర్పంచ్‌లు చర్చిస్తుండగా ఆర్టీఐ కార్యకర్త సంకెళ్ల రాంబాబు సర్పంచ్‌ల పట్ల దురుసుగా ప్రవర్తించాడు. దాంతో మాటామాటా పెరిగి గలాటాకు దారితీసింది. పంచాయతీలకు వచ్చే నిధులు, వాటిని వినియోగిస్తున్న తీరు నాకు తెలుసు. మామూళ్లు ఇస్తే సరే. లేదంటే మీ బండారాలు బయట పెడతామని హెచ్చరించడంతో సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీఐ కార్యకర్త తీరును నిరసిస్తూ సర్పంచ్‌లు పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. సర్పంచ్‌లు పొణకల గణేష్, పరమట శ్యామ్‌కుమార్, రేలంగి దుర్గారావు, చెల్లుబోయిన నాని, గంగుమళ్ల ఏసుబాబు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థి కుటుంబానికి రూ.75వేలు సాయం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 6: అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో 1993-96 బ్యాచ్ బీకాం విద్యార్థులు తోటి విద్యార్థి కుటుంబానికి అండగా నిలిచారు. అలనాటి మిత్రుడైన యల్లమిల్లి నాగార్జునరావు అప్పట్లో కొవిడ్‌తో మృతిచెందాడు. పూర్వ విద్యార్థుల కలయిక అనంతరం నాగార్జునరావు కుటుంబ ఆర్థిక పరిస్థితిపై ఆరా తీశారు. అతని భార్య వీరరాఘవమ్మ కేన్సర్‌తో బాధపడుతోందని తెలుసుకున్నారు. వెంటనే మిత్రులంతా కలిసి రూ.75వేలు సమకూర్చి సిరిపల్లి గ్రామంలో ఉంటున్న నాగార్జున కుటుంబానికి మంగళవారం అందజేశారు. పూర్వ విద్యార్థులు గొవ్వాల రాజేష్‌కుమార్, పిండి శేషు, సాపే శ్రీనివాస్, చొల్లంగి సుబ్బిరామ్, గోకవరపు వరప్రసాద్, గోకవరపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

42మందికి స్కాలర్‌షిప్

ఆత్రేయపురం,ఫిబ్రవరి 6:మలబార్ గోల్డ్ సీఎస్ఆర్ చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ మండలంలోని మహాత్మాగాంధీ జూనియర్ కళాశాలకు చెందిన 42మందికి రూ.4లక్షల విలువైన చెక్కులను అందించారు. మలబార్ సంస్థ ప్రతినిధులను ఎంజీ కళాశాల సెక్రటరీ-కరస్పాండెంట్ పీఎస్ రాజు, ప్రిన్సిపాల్ బీవీఆర్ అభినందించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: బూట్‌కట్ బాలరాజు
శ్రీలలిత	: ధీర
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: సైంధవ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: హనుమాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గేమ్ ఆన్

ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

అల్లవరం, ఫిబ్రవరి 6: ఓబీసీ మహిళలకు అసెంబ్లీ, పార్లమెంటు, స్థానిక సంస్థల సీట్లలో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అమలాపురం ఎంపీ చింతా అనురాధ పార్లమెంటులో మాట్లాడారు. ఓబీసీలకు మరింత విద్యా ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. జమ్ముకశ్మీర్, స్థానిక సంస్థల చట్టాల సవరణ బిల్లుకు మద్దతు తెలుపుతూ ఎంపీ అనురాధ మాట్లాడినట్టు ఆమె కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

గోడి గురుకుల విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

అల్లవరం, ఫిబ్రవరి 6: గోడి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌గా అమలాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఒకేషనల్ కోర్సు, ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్ ట్రేడ్ శిక్షణలో భాగంగా ఈసందర్శన జరిగింది. విద్యుత్ ప్రసారం, పంపిణీ వ్యవస్థ, లోడ్‌బ్రేక్, సర్క్యూట్ బ్రేక్ అంశాలను ఇన్‌చార్జి ఏఈ అప్పారి హరిబాబు విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ మహ్మద్ ఇబ్రహీం జాని, ఒకేషనల్ ట్రైనర్ ఎం.ప్రవీణ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలని ధర్నా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 6: పట్టణ పరిధిలోని శ్రీరామపురంలో జనావాసాల మధ్య ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ మంగళవారం జనసేన, టీడీపీ నాయకులు మహిళలతో కలిసి ధర్నా చేపట్టారు. మద్యం షాపును తొలగించాలని స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని మహిళలు ఆగ్రహించారు. మందుబాబులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. షాపు తొలగించే వరకు ఆందోళన కొనసాగిస్తామని మహిళలు హెచ్చరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, నాయకులు మామిళ్లపల్లి దొరబాబు, మహాదశ నాగేశ్వరరావు, గంటి మణికంఠస్వామి, పిండి రాజా, టీడీపీ నాయకుడు వాసంశెట్టి సత్యం పాల్గొన్నారు.

10న నవోదయ ప్రవేశ పరీక్ష

యానాం, ఫిబ్రవరి6: యానాంజవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో 9,11తరగతుల్లో ఖాళీగాఉన్న సీట్ల భర్తీకి ఈనెల10న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ప్రకాశరావుతెలిపారు. పరీక్ష ఉదయం 10.30నుంచి 1.30గంటలవరకు జరగనుంది. 11వ తరగతికి యానాం జవహర్ నవోదయ విద్యాలయం, 9వ తరగతికి మెట్టకుర్రులోని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా నిర్ణయించారు. పరీక్షాసమయానికి 30నిమిషాలు ముందుగా కేంద్రానికి రావాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 6: ఆటో డ్రైవర్లు రహదారి నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.మనోహర్‌జోషీ హెచ్చరించారు. ఉప్పలగుప్తంలో మంగళవారం జరిగిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని, ఓవర్ లోడింగ్ చెయ్యరాదని సూచించారు. ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు పోతుమూడి కొండబాబు, అధ్యక్షుడు కట్టా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు కుంచే రవి, సభ్యులు గెద్దాడ శివ, నల్లా భద్ర, రవణం పళ్లంరాజు, తోరం శ్రీను, మహదశ వీరబాబు, నల్లా దుర్గారావు, ఈతకోట సుబ్బారావు, లింగం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 6: సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని ముమ్మిడివరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శ్రీనునాయక్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బ్లాక్ లెవెల్ ఎన్నికల అధికారులు, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించి అక్కడ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు అయితాబత్తుల పండుబాబు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అక్కడక్కడా నమోదైన డబుల్ ఎంట్రీలను తొలగించాలని ఏఈఆర్వో దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో నాలుగు మండలాల ఎన్నికల అధికారులు డీఎల్‌వోలు, వీఆర్వోలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాలబాలాజీకి వెండి వస్తువుల బహూకరణ



వెండి వస్తువులకు పూజలు చేస్తున్న అర్చకులు

మామిడికుదురు, ఫిబ్రవరి 6: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారికి పెనుగొండ మండలం తామరాడ గ్రామానికి చెందిన కానూరి శ్రీనివాసరావు-కనకదుర్గ వెంకటలక్ష్మి దంపతులు రూ.2 లక్షల విలువైన వెండితో తయారుచేయించిన శంఖదార, చక్రధారాలనుబహూకరించారు. సంప్రోక్షణ తర్వాత వాటిని స్వామివారికి సమర్పించారు. భక్త దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం ఇచ్చారు. దంపతులకు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సహాయ కమిషనర్ జి.మాధవి స్వామివారి చిత్రపటం అందించారు.

ఎంపీడీవోకు సత్కారం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 6: ఆత్రేయపురం ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై వెళ్తున్న నాతి బుజ్జిని మంగళవారం ఘనంగా సత్కరించారు. నాలుగున్నరేళ్లు ఆమె అందించిన సేవలను ఎంపీపీ కుండా అన్నపూర్ణ, జడ్పీటీసీ బోణం సాయిబాబా ప్రశంసించారు. సర్పంచ్‌లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాసంఘాలు ఎంపీడీవోను సత్కరించారు. నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావుకు ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యానాం, ఫిబ్రవరి 6: ఏపీ ట్రాన్స్‌కో కాకినాడలో విద్యుత్ వైర్ల మరమ్మతుల కోసం బుధవారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు యానాంలో సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ లంక కృష్ణారావు తెలిపారు.

ఘనంగా రజకుల బల్ల పూజ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 6: ఠాణేలంకలో రజకులు మంగళవారం సంప్రదాయబద్ధంగా బల్లలకు పూజచేసి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. గ్రామంలో వారి నివాసాల నుంచి బాజాభజంత్రీలు, బాణసంచా కాల్పులతో గ్రామదేవత బలుసులమ్మతల్లి అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. రజక సంఘ పెద్దలు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల గృహ నిర్బంధం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 6: రాష్ట్ర సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్ పిలుపుమేరకు మంగళవారం 'చలో అసెంబ్లీ' నిర్వహించారు. విజయవాడ వెళ్లేందుకు ఆత్రేయపురం, లొల్ల, మెర్లపాలెం, అంకంపాలెం, రాజవరం, వద్దిపర్రు గ్రామాల సర్పంచ్‌లు సమాయత్తమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారి కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు. చలో అసెంబ్లీకి వెళ్లకుండా సచివాలయ మహిళా పోలీసులు నిర్బంధించారు.

108బియ్యం బస్తాలు అందజేత

ఆలమూరు. ఫిబ్రవరి 6: చింతలూరులో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి గుమ్మిలేరుకు చెందిన మోడ్రన్ రైస్‌మిల్లు అధినేత వంక సత్యనారాయణ (అన్న వరం) మంగళవారం 108బస్తాల బియ్యం స్వామివారి బ్రహ్మోత్సవాల్లో అన్నదానం కోసం అందజేశారు.

రాజోలు తహసీల్దార్‌గా పాల్

రాజోలు, ఫిబ్రవరి 6: తహసీల్దార్‌గా ఎం.పాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణా జిల్లా రెడ్డిగూడెం నుంచి బదిలీపై వచ్చారు. పాల్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేసిన బి.ముక్కేశ్వరరావు భీమవరం జిల్లా తణుకుకు బదిలీపై వెళ్లారు.

ఓట్ ఫర్ ఓపీఎస్

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి6: యూటీఎఫ్ రూపొందించిన ఓట్‌ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను భీమనపల్లి శ్రీమతిశిరంగు రంగనాయకమ్మ జడ్పీఉన్నత పాఠశాలలో హెచ్ఎం నూకల సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా 'మన ఓటు-మన భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. నడింపల్లి పద్మనాభన్, అరవ నాయుడు, కామన మధుసూదనరావు, పెండ్యాల శ్రీనివాసరావు, బ్రహ్మారావు, శ్రీవాణి, శారద, సుబ్బారావు, లక్ష్మి, అనూరాధ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

రాజోలు, ఫిబ్రవరి 6: సర్పంచ్‌ల హక్కులను వైసీపీ ప్రభుత్వం కాలరాస్తుందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావ విమర్శించారు. తాటిపాకలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ నిధులను దారిమళ్లించి సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చలో అసెంబ్లీకి వెళ్లకుండా సర్పంచ్‌లను హౌస్ అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పంచాయతీల నుంచి తీసుకున్న నిధులను తిరిగి ఇవ్వాలని గొల్లపల్లి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఎంపీపీ కేతా శ్రీను, మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, ఆరుమిల్లి రామన్న, పితాని సూరిబాబు, వలవల శేఖర్ పాల్గొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయం, అమలాపురం

ఆర్.ఒ.సి.నెం. 657/2021-ఎ1 తేది:06-02-2024

బహిరంగ వేలం నోటీసు

అమలాపురం పురపాలక సంఘంనకు చెందిన మున్సిపల్ కార్యాలయ మెయిన్ గేటు ప్రక్క ఉన్న మీ సేవా బిల్డింగుకు అధికారులు నిర్ణయించిన కాలము నుండి 3 సం॥ల కాలమునకు బ్యాంకులు, హాస్పటల్స్, వ్యాపారానికి సంబంధించి అద్దెకిచ్చుటకు తాత్కాలిక పద్ధతిన నెలవారి అద్దె ప్రాతిపదికన లీజుకిచ్చుటకు ది.20-02-2024 మంగళవారం ఉదయం 11.00 గంటలకు అమలాపురం పురపాలక సంఘ కార్యాలయము నందు కమీషనరు వారిచే గాని అనుమతి పొందిన వేరొక అధికారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును. వేలం నందు పాల్గొను వారు పురపాలక సంఘంనకు సంబంధించిన బైలా నియమ నిబంధనలకు లోబడి బహిరంగ వేలంనందు పాల్గొనవలెను.

వ.నెం	వివరములు	డిపాజిట్	సాల్వెన్సీ సర్టిఫికేట్ విలువ
1	మున్సిపల్‌కార్యాలయ మెయిన్ గేటు ప్రక్క ఉన్న మీ సేవా ఆర్.సి.సి.బిల్డింగు (పొడవు 86.30Xవెడల్పు 23=1985 చ॥అ॥ల వైశాల్యం.	3,00,000/-	5,00,000/-

ఇతర వివరముల కొరకు కార్యాలయ పనివేళలలో రెవెన్యూ విభాగం నందు సంప్రదించవలసినదిగా కోరడమైనది.

(సం/-) యస్.మనోహర్, కమిషనరు
అమలాపురం పురపాలక సంఘం